కేబుల్ వైర్లు.. అస్తవ్యస్తం

తుప్పు పడుతున్న ఇనుప స్తంభాలు
తగిన చర్యలు తీసుకుంటామన్న అధికారులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కేబుల్ వైర్లు పాదల్లా అల్లుకుని దర్శనమిస్తున్నాయి. పలు కేబుల్ సంస్థలు, ప్రైవేటు ఇంటర్నెట్ సంస్థలకు చెందిన కేబుళ్లను ఇష్టానుసారంగా విద్యుత్ స్తంభాలకు కట్టివేయడంతోపాటు అవి తెగిపడేటట్లు ఉన్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. లారీలు, పెద్ద వాహనాలు వచ్చిన సమయంలో అవి తెగిపడి ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో చిన్నారులు ఇంటి బయట ఆడుకునేందుకు కూడా భయపడాల్సి వస్తుందని పలు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న ఇనుప స్తంభాలను తొలగించాలని వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసి అనుమతులు లేని కేబుల్ వైర్లను గుర్తించి తొలగించాలని పలువురు పేర్కొంటున్నారు.





వాణీనగర్‌లో వేలాడుతున్న వైర్లు

వర్షాకాలంలో అత్యవసర ఫోన్ నెంబర్లు..

ఏఈ ఫోన్ నెంబర్లు	
9440813189	మల్కాజిగిరి
9440816239	వినాయక్‌నగర్
9440813192	వసంతపురి
9440813190	గౌతంనగర్

ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫోన్ నెంబర్లు	
9490153537	మల్కాజిగిరి
9490153542	వినాయక్‌నగర్
9490153544	వసంతపురి
9490153540	గౌతంనగర్

అన్ని చర్యలు తీసుకుంటాం..



గౌతంనగర్ డివిజన్ పరిధిలోని విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్లను గుర్తించాం. కొన్ని కేబుల్ వైర్లకు అనుమతులు ఉన్నాయి. మరి కొన్నింటికీ అనుమతులు లేవు. వాటన్నింటినీ గుర్తించి, వర్షాకాలంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.
– యాదగిరి, విద్యుత్‌శాఖ ఏడీఈ

పూడికతీత నిధులపై స్పందించిన ఎమ్మెల్యే

- పనుల పట్ల అధికారుల తీరుపై అసహనం
- నేడు కాప్రా ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష

సాక్షి ఎఫెక్ట్..

కుషాయిగూడ: పూడికతీత పనుల నిధుల గోల్‌మాల్‌పై 'సాక్షి'లో ప్రచురించిన చేసీచేయనట్టుగా.. చూసీ చూడనట్టుగా కథనంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అధికారులు స్పందించారు. పనులు పూర్తిస్థాయిలో జరగడంలేదన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. తూ.. తూ.. మంత్రంగా పూడికతీస్తే వచ్చే విపత్తుకు అధికారులు, కాంట్రాక్టరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అధికారుల తీరుపై అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. పూడికతీత పనులపై ఈరోజు కాప్రా సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముంపు కాలనీల ప్రజలు, నాలా పరివాహక ప్రాంతాల్లో ఉండేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలిగిన తన దృష్టికి తీసుకురావాలన్నారు.



బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే

వ్యర్థాల తరలింపులో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..

నాలాల నుంచి తొలగించిన వ్యర్థాల తరలింపులో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మారుతీనగర్, ఆదర్శనగర్, పద్మశాలీకాలనీ ప్రాంతాల్లో నాలాల నుంచి తీసిన వ్యర్థాలను అక్కడే వదిలేశారు. దాదాపుగా 20 రోజులుగా వ్యర్థాలు అక్కడే ఉన్నాయని, చుట్టుప్రక్కల వారు అక్కడే చెత్త వేయడంతో దుర్గంధభరితంగా మారి దుర్వాసన వస్తుందని కాలనీల ప్రజలు వాపోతున్నారు. వ్యర్థాలను వెంటనే తరలించాలని కోరుతున్నారు.

కాంట్రాక్టరుకు నోటీసులు జారీ ..

పూడికతీత పనుల్లో ఆలసత్వం ప్రదర్శిస్తున్న కాంట్రాక్టరుకు నోటీసులు జారీ చేసినట్లు ఏఈ కీర్తి తెలిపారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు ఆమె పేర్కొన్నారు. నాగార్జుననగర్ మెయిన్ రోడ్డులో పూడికతీత పనులు ప్రారంభించారు. మరో 10 రోజుల్లో పూర్తి స్థాయిలో పూడికతీత పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు.



మారుతీనగర్, ఆదర్శనగర్ కాలనీ సమీపంలో గుట్టలుగా పేరుకుపోయిన నాలా వ్యర్థాలు



నాగార్జుననగర్ మెయిన్‌రోడ్డులో పూడిక తీయిస్తున్న ఏఈ కీర్తి

ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మీమాధవి



ఉప్పల్: ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మీ మాధవి బాధ్యతలు స్వీకరించారు. ఆమె రాచకొండ సీపీ కార్యాలయం నుంచి ఉప్పల్‌కి బదిలీపై వచ్చారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నియామలను పాటించాలని సూచించారు. ఉప్పల్‌లో పనిచేసిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి సైబర్ క్రైమ్‌కు బదిలీపై వెళ్లారు.

రేపు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

కుషాయిగూడ: కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణలో ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చినట్లు విద్యార్థుల రాజకీయ పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు నర్రా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్‌బీకాలనీలో జరిగిన పార్టీ సమావేశంలో తీర్మానించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేసే వరకు పోరాటం చేస్తామన్నారు. రేపు జరగబోయే విద్యాసంస్థల బంద్‌కు ప్రజాస్వామ్యవాదులంతా మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు. పార్టీ గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు సాత్వికారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కమలాకర్, నవీన్‌బాబు, అనికేత్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్యం, వాస్తు శిక్షణ తరగతులు

రామంతాపూర్: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్స్ ఆధ్వర్యంలో జ్యోతిష్యం వాస్తు హస్తరేఖ సర్టిఫికెట్ కోర్సులు రామంతాపూర్ వివేక్‌నగర్‌లోని విద్యారణ్య హైస్కూల్‌లో జూలై 7 నుంచి ప్రారంభమవుతాయని కో–ఆర్డినేటర్ నారవరం చంద్రశేఖర్‌చారి సోమవారం తెలిపారు. ఆసక్తి గల వారు 9396255889.

వినతిపత్రాల అందజేత



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

అల్వాల్: అల్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అల్వాల్‌లోనే ఏర్పాటు చేయాలని కోరుతూ అల్వాల్, మచ్చబొల్లారం బీజేపీ నేతలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అల్వాల్‌కు చెందిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సికింద్రాబాద్‌లోని బేగంపేటలో ఉందని, అల్వాల్, మచ్చబొల్లారం, వెంకటాపురానికి చెందిన భూముల రిజిస్ట్రేషన్‌ల కోసం బేగంపేట్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అల్వాల్‌కు రావడంలేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. బీజేపీ నేతలు వెంకటేష్, మల్లికార్జున్‌గౌడ్, అజిత్‌సాయి, మల్లికార్జునయాదవ్, సుజాత, ఆనంద్, ప్రదీప్ తదితరులున్నారు.

ప్రాణాలకు రక్షణ కల్పించండి !

బీజేపీ నేత లక్ష్మణ్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌గౌడ్

కుషాయిగూడ: ప్రభుత్వ స్థలం కబ్జాను అడ్డుకున్నందుకు కొంతమంది నాపై కుట్రలు చేసి నన్ను చంపాలని చూస్తున్నారని, నా ప్రాణాలకు రక్షణ కల్పించాలని బీజేపీ నేత లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. స్థానిక బీజేపీ నేతలతో కలిసి సోమవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాప్రా మండలం, చక్రిపురం సర్వే నెంబర్లు 215, 222లోని కొంత ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి కబ్జా చేసి ప్లాట్లు చేసి 2011లో విక్రయించాడని తెలిపారు. దీనిపై అప్పటికే హైకోర్టు సదరు స్థలం ప్రభుత్వ స్థలమని పేర్కొనడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ప్లాట్లు కొనుగోలు చేసిన సామాన్యులు ఇబ్బందులు పడ్డారని వివరించారు. కోర్టు, అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. తిరిగి 2021లో ఆ సర్వే నెంబర్లలోని 4 వేల గజాల స్థలంలో ప్లాట్లు చేసి విక్రయించారన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో నిర్మాణాలను కూల్చివేశారని తెలిపారు. తాజాగా సదరు స్థలంలో ఓ వ్యక్తి జరిపిన నిర్మాణాన్ని గత శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారన్నారు. దీంతో నాపై కక్ష పెంచుకున్న చక్రీపురం కాలనీకి అసోసియేషన్‌కు చెందిన కొంతమంది వ్యక్తులు కబ్జాదారుడితో కలిసి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారితో తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై గతంలో కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, సీపీతో పాటు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. బీజేపీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు నాదం, వెంకటేశ్వర్లు, ఇస్లావత్ హరినాయక్, ప్రభాకర్, వెంకటేష్, సోమసాని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సునీతాయాదవ్

మౌలాలి: ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. సోమవారం మారుతీనగర్‌కాలనీలో పాదయాత్ర చేపట్టారు. మారుతీనగర్, ఆర్టీసీకాలనీలో రోడ్డు గుంతలమయం కావడంతో వెంటనే అధికారులతో మాట్లాడి రోడ్డు వేయించాలని కార్పొరేటర్‌ను స్థానికులు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె అధికారులతో చర్చిస్తానన్నారు. కాలనీ అధ్యక్షులు ఆంజనేయులు, సామిరెడ్డి, శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు సాయిబాబా, లింగారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 2వ డివిజన్ గాంధీనగర్‌లో చిరు జల్లులకే కాలనీ ముంపునకు గురవుతుంది. వరద నీరు దిగువ ప్రాంతానికి వెళ్లేందుకు సరైన అవుట్‌లెట్ మార్గం లేదు. దీంతో కాలనీలో పడిన వర్షం అక్కడే నీరు నిలిచిపోవడంతో లోతట్టులో ఉన్న ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరుతుంది. కాలనీవాసులు రాకపోకలు సాగించడం ఇబ్బందిగా మారుతుంది. అధికారులు, పాలకవర్గం చొరవ తీసుకుని గాంధీనగర్ కాలనీలో వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసి తమను కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.



గాంధీనగర్ కాలనీలో నిలిచిన వర్షపు నీరు

ఇది అక్రమమైతే.. అదేలా సక్రమం ?

కుషాయిగూడ: రోడ్డు కబ్జాచేసి నిర్మించిన ఓ ప్రహారిని కూల్చివేసిన కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారులు దాని పక్కనే ఉన్న మరో వ్యక్తికి చెందిన ప్రహరీని కూల్చివేయకపోవడంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇది అక్రమమైనప్పుడు అదేలా సక్రమమమవుతుందంటూ.. కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. చర్లపల్లి డివిజన్, కుషాయిగూడ, హనుమాన్‌నగర్ కాలనీలో కొన్నిరోజుల క్రితం ఓ నిర్మాణదారుడు అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టాడు. కాగా అపార్టుమెంట్ ముందున్న రోడ్డుకు 10 ఫీట్ల మేర పెంచి ప్రహరీ నిర్మించాడు. దీనిపై కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు ప్రహరీని కూల్చివేశారు. నిర్మాణదారుడు పక్క స్థలంలో నిర్మించిన మరో ప్రహరీని సాకుగా చూపి దానిని అనుసరించే ప్రహరీని నిర్మించానని అధికారులకు వివరణ ఇచ్చాడు. చాలా రోజులుగా ఈ వివాదం కొనసాగుతోంది. ఈ విషయాన్ని అధికారులను ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వడం లేదని వాపోతున్నారు.



అధికారులు కూల్చివేయకుండా వదిలేసిన ప్రహరీ

'ప్రజావాణి'తో సమస్యల పరిష్కారం



విజ్ఞప్తులను స్వీకరిస్తున్న కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 33 దరఖాస్తులు అందాయని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. ప్రజావాణిలో వచ్చే సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించడమే ధ్యేయంగా తాము పనిచేస్తామని కమిషనర్ వివరించారు. ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ బిక్షపతి, టీపీఓ అలీపాషా తదితరులున్నారు.

ప్రజావాణిలో 11 ఫిర్యాదులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 11 ఫిర్యాదులు వచ్చినట్లు కమిషనర్ రాంలింగం తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విభాగానికి 7 ఫిర్యాదులు, విద్యుత్‌పై 2, జలమండలి1, రెవెన్యూ 1 ఫిర్యాదు అందిందన్నారు. ఈ ఫిర్యాదులపై సత్వర పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



కాలనీలో మొక్కలు నాటుతున్న ఆనంద్

బోడుప్పల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్ అన్నారు. బోడుప్పల్ 14వ డివిజన్ పరిధిలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా సోమవారం మొక్కలు నాటి కాలనీవాసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రాణత్యాగం ఫలితంగానే నేడు జమ్మూకశ్మీర్‌కు స్వేచ్ఛ లభించిందన్నారు. పురుషోత్తం, సాయి నరేంద్ర, కొమురయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యతతో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రయ్య

మౌలాలి: బీసీలంతా ఐక్యతతో ఉండాలని ప్రొఫెసర్ చంద్రయ్య కురుమ అన్నారు. సోమవారం సంతోషిమానగర్ కాలనీలోని జీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో బీసీ కులాల ఐక్యవేదిక మల్కాజిగిరి నియోజకవర్గం సర్వసభ సమావేశం కామల్ల ఐలన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ చంద్రయ్య హాజరై మాట్లాడారు. బీసీ కులాల ఐక్య వేదిక సంఘం నిర్మాణం బలోపేతం చేయాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి అప్పాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రమేష్‌గౌడ్, చంద్రశేఖర్ రావు, కొండల్‌గౌడ్, రామకృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారుల సమీక్ష

కుషాయిగూడ: డివిజన్‌లో అభివృద్ధి పనులపై చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనులపై చర్చించారు. నాలాలకు రక్షణగా పెన్సింగ్ ఏర్పాటు అంశాలపై మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు వినతి..

చర్లపల్లి డివిజన్ పరిధిలోని శ్రీ విఘ్నేశ్వర డబుల్‌బెడ్రూం ఇళ్ల అసోసియేషన్ ప్రతినిధులు తమకు వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. మౌలిక వసతులైన విద్యుత్, తాగునీటితో పాటు లిఫ్ట్ మరమ్మతులు, భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. 15 రోజుల్లో పనులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.



ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

పరిశుభ్రత పాటించకుంటే చర్యలు తప్పవు



టీఎక్స్ ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న డీసీ ఆంజనేయులు

ఉప్పల్: పరిశుభ్రత పాటించని హోటల్స్ ఫంక్షన్‌హాళ్లు, ఆసుపత్రులపై చర్యలు తప్పవని ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు హెచ్చరించారు. సోమవారం సాధారణ తనిఖీల్లో భాగంగా ఉప్పల్ ప్రధాన రహదారిలో ఉన్న టీఎక్స్ ఆసుపత్రిలోని పెషెంట్లకు అందజేసే ఆహార పదార్థాల కిచెన్‌ను తనిఖీ చేశారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉండటం, వెంటిలేషన్ లేకపోవడంతో రూ.50 వేల జరిమానా విధించారు. పరిశుభ్రత పాటించాని హోటళ్లు, ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ హెడ్ చందనను ఆదేశించారు, ఫంక్షన్‌హాల్స్, టిఫిన్ సెంటర్ నిర్వాహకులు స్వచ్ఛ ఆటోలకు చెత్తను వేసేలా చూడాలన్నారు.

పరామర్శ

అల్వాల్: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అల్వాల్ పంచశీలకాలనీలోని ఆయన నివాసానికి వచ్చి ఇటీవల మరణించిన ఎమ్మెల్యే భార్య రూపాదేవికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు.



ప్రజా సమస్యలు పరిష్కరించాలని..



మౌలాలి: ఆర్టీసీకాలనీ, హనుమాన్‌నగర్ కాలనీ రోడ్డు వేయాలని డీసీ రాజును స్థానికులు కోరారు. రోడ్డు లేక తీవ్ర ఇబ్బందుల పడుతున్నామని, రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. త్వరలో రోడ్డు వేస్తామని డీసీ కాలనీవాసులకు హమీ ఇచ్చారు. బీజేపీ నేత మోహన్‌యాదవ్, శేఖర్, జబ్బర్, రాకేష్, ప్రవీణ్ తదితరులున్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి

అదనపు కలెక్టర్ అభిషేక్

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. ఇంటింటికి వెళ్లి జ్వర సంబంధమైన కేసులను ముందుగానే గుర్తించి, నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీధిలో స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యకలాపాలు నిర్వహించటం ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. పురపాలక సంఘాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు, మలేరియా , డెంగ్యూ నిరోధక మాసాలను పాటించటం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ బదిలీ

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) అభిషేక్ అగస్త్య ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. రెండేళ్లుగా ఆయన ఇక్కడ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 13 పురపాలక సంఘాలు ,61 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో తన వంతు సేవలను అందించారు. అక్రమ కట్టడాలతో సహా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను ఆరికట్టటంలో కీలకంగా వ్యవహరించారు. ఈయన స్థానంలో జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీ)గా ప్రభుత్వం ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు.



విద్యార్థులకు అండగా ఉంటా

కుషాయిగూడ: ఫీజుల బకాయిల పేరుతో టీసీ, మెమోలు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్న ప్రైవేటు విద్యాసంస్థల బాధితులకు అండగా ఉంటానని హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్ అన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు తనను ఆశ్రయించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. వారికి కావాల్సిన న్యాయసాయం అందించి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడే విద్యార్థులు 7710678678 నంబరును సంప్రదించి న్యాయసాయం పొందవచ్చు.

ఆలయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు



అల్వాల్: వెంకటాపురంలోని శ్రీ పోచమ్మ దేవాలయంలో అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం చండీహోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ ఈశ్వరమ్మకు న్యాయం చేయాలి

అల్వాల్: కొల్లాపూర్ నియోజకవర్గం మొలచింతపల్లి పరిధిలో ఆదివాసీ నిరుపేద మహిళ ఈశ్వరమ్మపై జరిగిన ఘటన సమాజానికి సిగ్గుచేటని అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ, గద్దర్ అభిమానుల సంఘం రాష్ట్ర కమిటీల నాయకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గి అమాయకులకు అన్యాయం చేయొద్దని వారు కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. చెంచు ఈశ్వరమ్మకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

వృద్ధురాలి అదృశ్యం



మైసమ్మ (ఫైల్)

కుషాయిగూడ: ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన సోమవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, రాజీవ్ నగర్‌కు చెందిన పొట్ట మైసమ్మ (75) ఇంట్లోనే ఉంటుంది. శనివారం రాత్రి 10:30 గంటల సమయంలో ఇంట్లో కుటుంబసభ్యులందరూ నిద్రిస్తుండగా.. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. నిద్రలేచిన కుటుంబసభ్యులు ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లభించలేదు. దీంతో ఆమె కుమారుడు మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై భద్రయ్య తెలిపారు.